క్లుప్తంగా

విక్రయాలకు సిద్ధంగా పచ్చిరొట్ట విత్తనాలు

పెదకాకాని: పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి పి సంధ్యారాణి తెలిపారు. జనుము, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీతో రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు. జనుములు కిలో రూ.44లు, పిల్లిపెసర రూ.67లు చొప్పున విక్రయాలకు సిద్ధంగా ఉన్నాయన్నారు. రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి సూచించారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌ను డెవలప్ చేసుకోండి



తెనాలిఅర్బన్: కమ్యూనికేషన్ స్కిల్స్‌ను అందరూ డెవలప్ చేసుకోవాలని ఎస్ఆర్ఐ విద్యా సంస్థల సీఈవో సిహెచ్.ఉమామహేశ్వరరావు సూచించారు. అమెరికన్ కంపెనీ వారి ఆధ్వర్యంలో తెనాలిలోని ఎస్ఆర్ఐ డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహిస్తున్న క్యాంపస్ రిక్రూట్‌మెంట్ పై శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. కంపెనీ ప్రతినిధులు 20 టీంలుగా విభజించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ప్రతిభ చూపిన ముగ్గురికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం.లాజర్‌బాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ కిషోర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

శాసనాలలో మన సంస్కృతి నిక్షిప్తం



నగరంపాలెం: శాసనాల అధ్యయనం ద్వారా మన భాష, సంస్కృతి, మూలాలు తెలుస్తాయని లేమల్లెపాడు ఎంటీఎస్ ఉపాధ్యాయుడు మోదుగుల రవికృష్ణ అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయ ఆవరణలో శనివారం అమరావతి అమరేశ్వరాలయ శాసనాల సంపుటి 'అమరేశ్వరం' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంపుటిలో ఉన్న 38 శాసనాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండే పలు ప్రాంతాలు, వెయ్యేళ్ల కిందట ఉమ్మడి జిల్లా రాజులు, వారి ప్రతినిధులు, ఉద్యోగులు ఇచ్చిన దానాలు మొదలైన విషయాలన్నీ తేటతెల్లంగా తెలుస్తాయని అన్నారు. సభకు అరసం ఏపీ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ కె.ప్రఫుల్లరాణి పుస్తకావిష్కరణ చేయగా, ప్రముఖ సాహితీవేత్తలు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, ఆర్.సాంబశివరావు, కోటేశ్వరప్రసాద్, కందిమళ్ల శివప్రసాద్, కె.శివరెడ్డి, నాగరాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి చేయూత



నగరంపాలెం: జిల్లాలో హోంగార్డు పని చేస్తున్న వై.అక్కేశ్వరరావు గతేడాది డిసెంబర్ 12న అనారోగ్యంతో మృతి చెందారు. జిల్లాలోని హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.2.37 లక్షల చెక్కుని అతడి భార్య ప్రమీలకు శనివారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో ఎస్పీ తుషార్ డూడీ అందించారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ స్వర్ణలత, ఆర్ఎస్ఐ కృష్ణయ్య, ఏఎస్ఐ చంద్రశేఖర్, హోంగార్డ్ ఎన్‌సీఓ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిశ్రుతి అకాడమీ వార్షికోత్సవం

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ పద్మావతి కళావేదికపై శనివారం సాయంత్రం సాయిశ్రుతి మ్యూజిక్ అకాడమీ 37వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. వ్యవస్థాపకులు ప్రేమ్‌కుమార్ శిష్య బృందం వోకల్, వీణా, వేణువు, మాండోలిన్, తబల, డోలక్, కీబోర్డు, హార్మోనియం, వయోలిన్, గిటార్, డ్రమ్స్ తదితర వాయిద్యాలతో ప్రతిభను చాటారు. కార్యక్రమానికి ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలన చేయగా, వల్లూరి కృష్ణకిశోర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.

సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

పట్నంబజారు: సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని కొత్తపేట పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపేటలోని ఓ ప్రాంతంలో సింగిల్ నంబరు లాటరీ ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ. 11,500 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వీవీఐటీ కళాశాలకు జాతీయ స్థాయి గుర్తింపు



అక్రిడిటేషన్ గుర్తింపు పొందిన నంబూరు వీవీఐటీ కళాశాల

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగాలకు మూడు సంవత్సరాల పాటు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ టైర్ 1 గుర్తింపు లభించినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు వీవీఐటీలో శనివారం చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ మాట్లాడుతూ కేవలం వీవీఐటీ కళాశాల మాత్రమే అర్హత కలిగిన అన్ని విభాగాల్లో ఎన్‌బిఏ గుర్తింపు దక్కించుకోవడం విశేషమన్నారు. స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాలలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ టైర్ 1 గుర్తింపును అందిస్తుందని వివరించారు. సీఎస్ఈ, మెకానికల్, ఈఈఈ విభాగాలకు చెందిన ఉన్నత స్థాయి విద్యా ప్రమాణాలు, అధునాతన పద్ధతుల్లో బోధన, పరిశ్రమ అవసరాలను గుర్తించేలా క్షేత్ర స్థాయి సందర్శనలు, సుదీర్ఘ అనుభవం కలిగిన అధ్యాపకులు తమ వద్ద ఉన్నారన్నారు. అన్ని అంశాలతో పాటు మౌలిక వసతులను పర్యవేక్షించిన ఎన్‌బిఏ బృందం 2026 వరకూ టైర్ 1 గుర్తింపు ఉత్తర్వులు అందించినట్లు తెలిపారు. విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణతతో పాటు అత్యధిక సంఖ్యలో ఉపాధి, ఉన్నత విద్యా అవకాశాలను అందిపుచ్చుకోవడం ద్వారా జాతీయ స్థాయి గుర్తింపు పొందగలిగిందని విద్యాసాగర్ తెలిపారు. ఎన్‌బిఏ గుర్తింపు పొందడం ద్వారా విద్యార్థులకు విదేశీ విశ్వ విద్యాలయాల్లో సులభంగా ప్రవేశాలను, మెరుగైన ఉపాధి కల్పన అవకాశాలు అందించవచ్చని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య, ఉపాధి అందించటమే లక్ష్యమని అన్నారు. గుర్తింపు పొందుటకు కారకులైన అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రిన్సిపల్ డాక్టర్ వై మల్లికార్జునరెడ్డి, కార్యదర్శి ఎస్ బదరీప్రసాద్, సంయుక్త కార్యదర్శి మామిళ్లపల్లి శ్రీకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ కె గిరిబాబు అభినందించారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు



సీఐ నరేష్ కుమార్

గుంటూరు రూరల్: పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్ల కదలికలపై అనునిత్యం నిఘా ఉంటుందని చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ నరేష్‌కుమార్ తెలిపారు. శనివారం అడవి తక్కెళ్ళపాడులోని నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల రోజు జూన్ 4వ తేదీతో పాటు ఆ తరువాత రోజుల్లో ఎవరైనా రౌడీషీటర్‌లు ప్రజా శాంతికి భంగం కలిగించే కార్యక్రమాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాష్ట్ర, జిల్లా అధికారుల ఆదేశాలతో రౌడీ షీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించటం జరిగిందన్నారు. చట్ట ఉల్లంఘనకు పాల్పడితే అటువంటి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు రౌడీషీటర్‌ల కదలికలపై నిఘా ఎప్పటికప్పుడు ఉంటుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వారి ప్రవర్తన ఇతరులకు ఇబ్బంది లేకుండా చూసుకోవాలని తెలిపారు. రాబోయే రోజుల్లో నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రశాంత వాతావరణం ఉండాలని ఎవరైనా దాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కౌంటింగ్ ముందు రోజు కాని కౌంటింగ్ పూర్తయిన తరువాత రోజు కాని ఎక్కడైనా రౌడీషీటర్‌ల కదలికలు కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

ప్రాంగణ ఎంపికల్లో ఎంబీటీఎస్ కళాశాల విద్యార్థుల ప్రతిభ




ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి విద్యతో పాటు ఉపాధి కల్పన లక్ష్యంగా టెక్నికల్ ఎడ్యుకేషన్ కళాశాలలను ఏర్పాటు చేయటం జరిగిందని టెక్నికల్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి కల్యాణ్ తెలిపారు. శనివారం నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యా విధానాల ద్వారా విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు లభించిందన్నారు. తులసీ సీడ్స్ సీనియర్ జనరల్ మేనేజర్ కెఎస్ఎమ్ రావు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తూ నైపుణ్యాలను పెంపొందించు కోవాలన్నారు. తులసీ సీడ్స్ మేనేజింగ్ డైరెక్టర్ తులసీ యోగేష్ చంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ప్రాంగణ ఎంపికలతో పాటుగా రానున్న కాలంలో ఈ కళాశాల విద్యార్థులకు తమ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరుగుతుందని హామీ ఇచ్చారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

ఈత.. కారాదు గుండెకోత !

- చిన్నారుల ప్రాణాలమీదకు తెస్తున్న ఈత సరదా
- సెలవుల్లో పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ అవసరం
- ఈతలో శిక్షణ ఇప్పిస్తే మంచిది



కృష్ణానది ప్రకాశం బ్యారేజ్‌పై ఎత్తు ప్రాంతం నుంచి నీటిలోకి దూకుతున్న బాలుడు

తాడేపల్లి రూరల్: చిన్నారుల ఈత సరదా ఒక్కోసారి ప్రమాదాలకు దారి తీస్తుంది. పాఠశాలలకు సెలవులు కావడం, వేసవి ఎండ తాపం నేపథ్యంలో స్నేహితులు, ఇరుగుపొరుగు వారితో కలిసి కాల్వలు, చెరువులు, గుంటలలో ఈతకని, స్నానానికని వెళ్లి పలువురు చిన్నారులు మృత్యువాత పడుతున్న ఘటనలు మనం చూస్తున్నాం . గుంటూరు జిల్లావ్యాప్తంగా ప్రకాశం బ్యారేజ్ నుంచి వివిధ ప్రాంతాలకు సాగు, తాగునీరు కోసం కాలువలు ఉన్నాయి. ఇవేకాకుండా జిల్లావ్యాప్తంగా అనేక చెరువులు, కుంటలు ఉన్నాయి. వీటిల్లో ఈతకని వెళ్లి పలువురు చిన్నారులు ప్రమాదాల బారిన పడుతూ తల్లిదండ్రులకు గుండెకోత మిగిలుస్తున్నారు.

కంట కనిపెట్టాలి

తల్లిదండ్రులు తమ పిల్లలు ఎక్కడికి వెళ్తున్నారనే విషయాన్ని క్షుణ్ణంగా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ వారు బయటకు వెళ్లిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలి. సెలవుల కారణంగా ఇళ్లవద్దే ఉంటున్న చిన్నారులను ఒక కంట కనిపెడుతూ, ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండటం మూలాన వారు ప్రమాదాల బారిన పడకుండా కాపాడుకోవచ్చు. ప్రస్తుతం ఎక్కడ చూసినా చిన్నారులు ఈత సరదాతో కాలువలు, నదులు, కుంటలు, చెరువులకు వెళ్తున్నారు. అందులో ఒకరికో ఇద్దరికో ఈత రావడం.. వారి భరోసాతో నీటి లోపలకు వెళ్లడంతో ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. స్నేహితులతో బయటకి పంపిస్తే ఎవరితో వెళుతున్నారు.. ఎక్కడికి వెళుతున్నారో కచ్చితంగా తెలుసుకోవాలి.

నీరు కన్నీరు

వానలు కురుస్తుండడంతో ఇప్పటికే జిల్లావ్యాప్తంగా కాలువలు, చెరువుల్లో నీరు చేరుకుంది. పిల్లలు సెలవు రోజుల్లో ఈతకోసం సరదాగా నీటివద్దకు వెళుతుంటారు. ఈత వచ్చిన వారితో పాటు ఈతరాని వారు కూడా నీటిలోకి దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈత వచ్చినవారు సైతం ఒక్కోసారి పెరిగే నీటి ప్రవాహానికి తట్టుకోలేక కొట్టుకొనిపోవడం, ఊబుల్లో దిగబడడం వంటివి జరుగుతుంటాయి. అందుకే సాధ్యమైనంతగా చెరువులు, కాలువలకు దూరంగా ఉండడం మంచిది. ఈ మధ్య కృష్ణానది ఎగువ, దిగువ ప్రాంతాల్లో చుట్టపు చూపుగా వచ్చిన ఎంతోమంది చిన్నారులు ఈత సరదాతో మృత్యువాత పడిన ఘటనలు చోటు చేసుకున్నాయి.

- గుంటూరు వెంకటరెడ్డిపాలేనికి చెందిన బీటెక్ విద్యార్థి ఇటీవల మహానాడులోని బంధువుల ఇంటికి వచ్చి పిల్లలతో కలసి కృష్ణానదికి వెళ్లి నీటి గుంటలో పడి మృతి చెందాడు.
- విజయవాడ రామలింగేశ్వనగర్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలకు సెలవులు కావడంతో సరదాగా ఈతకు వచ్చారు. అందులో ముగ్గురు మృతిచెందగా ఒక బాలుడు గల్లంతయ్యాడు. ఇప్పటి కూడా ఆచూకీ లభించలేదు.

తల్లిదండ్రులే బాధ్యత వహించాలి



సరదాగా ఈతకు వెళ్లి ముక్కుపచ్చలారని చిన్నారులు ఎంతోమంది నదులు, కాలువల్లో దిగి ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. పిల్లలకు ఈత అంటే సరదా. సెంటర్లకు పంపి నేర్పించడం చాలా మంచిది. వారి కోర్కెలను మనం గుర్తించకుండా ఉండడం వల్లే చాలామంది ఇంట్లో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లి మృత్యువాత పడుతున్నారు. మంగళగిరి కార్పొరేషన్‌లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేశారు. అలాంటి కేంద్రాలకు పిల్లలను పంపి నేర్పించాలి.

– రామకృష్ణ, ఈత శిక్షకుడు

అప్రమత్తంగా ఉండాలి..

సెలవుల్లో విద్యార్థులు, ఊర్లకు వెళ్లే కుటుంబాల వారు అన్ని విషయాల్లో తగిన రీతిలో జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా చిన్నారులు నదులు, కాలువలు, బావులలో సరదాగా ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి.

– కల్యాణ్ రామ్, తాడేపల్లి సీఐ

బీసీజీ టీకా సురక్షితం



శిబిరంలో అవగాహన కల్పిస్తున్న డాక్టర్ యానీ గ్రేస్

ఫిరంగిపురం: బీసీజీ టీకాతో దుష్ఫలితాలు ఉండవని డాక్టర్ యానీగ్రేస్ తెలిపారు. మండలంలోని మేరికపూడి వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో శనివారం నుదురుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. 98మందికి షుగర్, బీపీ, థైరాయిడ్ పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు బీసీజీ టీకాలు వేయించుకోవడంవల్ల కలిగే ప్రయోజనాల గురించి డాక్టర్ యానీగ్రేస్ వివరించారు. 18ఏళ్లు నిండి బరువు తక్కువ ఉన్నవారు, 60ఏళ్లు పైబడినవారు, షుగర్ ఉన్నవారు, పొగతాగేవారు కూడా బీసీజీ టీకా వేయించుకోవడం ద్వారా మున్ముందు క్షయవ్యాధి రాదని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది కె.సుదర్శన్‌రాజు, గంగరాజు, పాపులమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైన్ షాపులో రూ. 1.50లక్షల చోరీ

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంట గల ప్రభుత్వ వైన్ షాపులో నగదు చోరీ జరిగిన ఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పట్టణ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... కొప్పురావూరుకాలనీ జాతీయ రహదారి వెంటగల ప్రభుత్వ వైన్‌షాపులో సిబ్బంది శుక్రవారం రాత్రి వరకు విక్రయించగా వచ్చిన రూ. 1.50లక్షలను కౌంటర్‌లో ఉంచి తాళాలు వేసి వెళ్లారు. శనివారం మరలా తెరిచేందుకు రాగా షట్టర్ల తాళాలు పగులగొట్టి ఉన్నాయి. కౌంటర్‌లోని నగదు కూడా మాయమైంది. దీంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లో షాపు సూపర్‌వైజర్ నక్కా గోపి ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

రౌడీషీటర్లపై నిఘా

మండలంలో అల్లర్లు జరగకుండా రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం ఉత్సవాలు నిర్వహించరాదని సూచించారు. ఊరేగింపులు, బాణసంచా కాల్చినా, కవ్వింపు చర్యలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లకు ప్రతిరోజూ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

తెనాలిలో అన్నమాచార్యుల సంకీర్తన గానం



అన్నమాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న రమణయ్య, శ్రీనివాసరావు, తదితరులు



సంకీర్తనలు ఆలపిస్తున్న శారద చలపతి, అనురాధ

తెనాలిఅర్బన్: శ్రీమాన్ శ్రీశ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులు 616వ జయంతి వారోత్సవాల్లో భాగంగా శ్రీ వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో నాజర్‌పేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం అన్నమాచార్యుల సంకీర్తన కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా ట్రస్ట్ కో-ఆర్డినేటర్ కారంపూడి రమాదేవి వృద్ధులకు అన్నదానం చేసి పండ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. ముందుగా అన్నమాచార్యుల చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కొండపి శ్రీనివాసరావు, అందె బాలచంద్రమౌళి, లక్ష్మీ రజిని, భారతి, మురళి, తదితరులు పాల్గొన్నారు.

- తాళ్ళపాక అన్నమాచార్యులు 616వ జయంతిని పురస్కరించుకుని సమరసతా సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నందులపేటలోని వినాకయ ఆలయ ప్రాంగణంలోని రామ మందిరంలో అన్నమాచార్యుల సంకీర్తనల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధి కడియాల సునీల్ కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వరస్వామి భక్తితో తనే స్వయంగా కీర్తనలు రాసి, సంగీతం సమకూర్చి పాడిన వాగ్గేయకారుడిగా అన్నమాచార్యులు నిలిచారని తెలిపారు. స్వామివారి ఆశీస్సులను పొందినట్లు చెప్పారు. అనంతరం అన్నమాచార్యుల సంకీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో వి.లక్ష్మీ సునీత, దీపాల మహేష్, శారద చలపతి, అనురాధ, రాజ్యలక్ష్మి, సుశీల, విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి రామాంజనేయులు, ఆలయ నిర్వాహకులు గోపీచంద్, తదితరులు పాల్గొన్నారు.

ఏజెంట్ల వివరాలు నెలాఖరులోగా ఇవ్వాలి

ఆర్‌ఓ కీర్తి చేకూరి



నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు హాజరయ్యే ఏజెంట్ల వివరాలు ఈనెల 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందించాలని తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, నగర కమిషనర్ కీర్తి చేకూరి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులకు తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4 జరగనున్న ఓట్ల లెక్కింపుపై గుంటూరు తూర్పు నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, సజావుగా జరగడానికి అభ్యర్థులు, ఏజెంట్లు సహకరించాలని ఆమె కోరారు. లెక్కింపు కేంద్రానికి హాజరయ్యే ఏజెంట్ల వివరాలను 31లోపు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో వివరాలు ఇవ్వాలని సూచించారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలని, గుర్తింపు కార్డ్ తెచ్చుకోవాలని ఆమె తెలిపారు. సెల్ ఫోన్ అనుమతి ఉండదన్నారు. జూన్ 3న ఆర్‌ఓ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లను యూనివర్సిటీలోని స్ట్రాంగ్ రూమ్‌కి తరలిస్తామన్నారు. 4వ తేదీ ఉదయం 5 గంటలకు లెక్కింపు సిబ్బందికి టేబుల్స్ వారీగా ర్యాండమైజేషన్ మేరకు కేటాయింపు జరుగుతుందని పేర్కొన్నారు.

ఆహ్వానం లక్ష్మి వారసత్వాన్ని నిలుపుకోవటం అవసరం

ప్రథమ వర్ధంతి సభలో ప్రముఖ కథా రచయిత, విమర్శకుడు పాపినేని శివశంకర్



మాట్లాడుతున్న పాపినేని శివశంకర్ వేదికపై మాధవరావు, వీరలక్ష్మీదేవి, దయానంద్

తెనాలి: సాహిత్య పత్రికా నిర్వహణలో ఉన్నత విలువలను పాటించిన ఆహ్వానం లక్ష్మి వారసత్వాన్ని నిలుపుకోవటం అవసరమని ప్రముఖ రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. ఈ క్రమంలో భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణార్థం నెలనెలా మంచి పుస్తకంపై సమీక్షను నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. పట్టణానికి చెందిన సాహితీ సాంస్కృతిక వేదిక భిన్నస్వరాలు ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మిగా చిరపరిచితులైన ఎస్.ఎస్.లక్ష్మి ప్రథమ వర్ధంతి సభను శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ఏర్పాటుచేశారు. జీఎస్ నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సంజీవదేవ్ స్ఫూర్తితో సాహితీ యాత్రను ఆరంభించిన లక్ష్మి, సాహిత్య సంస్కారం , అభిరుచితో కొనసాగించటం గొప్ప విషయమన్నారు. కత్తిమీద సాములాంటి సాహిత్య పత్రిక నిర్వహణకు తన సొంత ఆస్తిని విక్రయించారని గుర్తుచేశారు. మరో ప్రముఖ కవి, రచయిత బండ్ల మాధవరావు తన ప్రసంగంలో అప్పట్లో కవిత్వం రాయటం ఆరంభించిన తనను, ఆహ్వానం లక్ష్మి సాహిత్య విమర్శ, పుస్తక సమీక్షల వైపునకు ప్రోత్సహించినట్టు చెప్పారు. ప్రముఖ కథారచయిత్రి, కవి వాడ్రేవు వీరలక్ష్మీదేవి మాట్లాడుతూ ఆహ్వానం లక్ష్మితో తన జ్ఞాపకాలను పంచుకున్నారు. సాహిత్యంతో జీవితం గడిపిన లక్ష్మి, ఆ రంగంలోని ఉత్తములతోనే అనుబంధం కొనసాగిస్తూ, మిగిలిన ప్రపంచంతో ఆసక్తి లేనట్టుగా ఉండేవారని స్మరించుకున్నారు. కథా రచయిత కాట్రగడ్డ దయానంద్ మాట్లాడుతూ ఆహ్వానం లక్ష్మి తన పత్రికతో చాలామంది కవులు, రచయితలకు దారిచూపారని చెప్పారు. ఆమె రాసిన సంపాదకీయాల విశిష్టతను వివరించారు. సాహిత్యంలో నిష్కామ కర్మ చేసిన ఆహ్వానం లక్ష్మి తనకుగా ఎన్నడూ గుర్తింపును కోరుకోలేదని చెప్పారు. భిన్నస్వరాలు బాధ్యుడు, కవి జుగాష్‌విలి పర్యవేక్షించిన సభలో సమయం రాజా సంజీవదేవ్, ప్రముఖ సాహితీ విమర్శకుడు బి.తిరుపతిరావు, రచయిత్రి నల్లూరి రుక్మిణి, శ్రీశ్రీ ప్రింటర్స్ విశ్వేశ్వరరావు, మొవ్వా సత్యనారాయణ, వేమూరి విజయ భాస్కర్, కనపర్తి బెన్‌హర్ తదితరులు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథుడికి చిన్నారుల నృత్యనీరాజనం

సంగీత నృత్యోత్సవంలో ప్రదర్శన



నృత్యోత్సవం అనంతరం అతిథులతో తెనాలి చిన్నారులు

తెనాలి: తెనాలి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీలో శనివారం ఉదయం జరిగిన కాశీ విశ్వనాథుని సంగీత నృత్యోత్సవంలో తెనాలి చిన్నారులు కూచిపూడి నృత్యాంశాలతో అభినందనలు అందుకున్నారు. భారత్ ఆర్ట్స్‌అకాడమీ, కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ ఫ్యాకల్టీ ఆఫ్ పెర్ఫార్మెన్స్, బెనారస్, హిందూ యూనివర్సిటీ, వారణాసి సంయుక్త ఆధ్వర్యంలో ఈ సంగీత నృత్యోత్సవాన్ని ఏర్పాటుచేశారు. తెనాలికి చెందిన ప్రముఖ నృత్యగురువు డాక్టర్ చల్లా బాల త్రిపుర సుందరి శిష్యబృందం 21 మంది కాశీ విశ్వేశ్వర స్వామి సన్నిధిలో చక్కటి నృత్యాంశాలతో ఆ నటరాజుకి నృత్యాభిషేకం చేసుకున్నారు

తొలుత బాల శిష్య బృందం అంబ ప్రార్థనతో ఆరంభించారు. మొదటి అంశంగా ఆనంద నర్తన గణపతి ప్రార్థనను అయిదుగురు విద్యార్థులు ప్రదర్శించారు. రెండో అంశంగా ఆనందతాండవం అనే అంశంలో చలమలశెట్టి మహతి, సంస్కృతి, వలివేటి మోక్షిక, తుమ్మల ప్రణతి యశస్విని. గీతికా షణ్ముఖ నర్తించారు. తదుపరి శివతాండవం, నాలుగో అంశంగా శివస్తుతి ప్రదర్శించారు. చివరగా డాక్టర్ చల్లా బాలా త్రిపుర సుందరి 'మహిషాసుర మర్దని' ప్రదర్శించి అందరి మన్ననలను పొందారు. ముఖ్యఅతిథులుగా కాశీ విశ్వనాథ టెంపుల్ ట్రస్ట్ సీఈవో విశ్వ భూషణ్ మిశ్రా, ట్రస్ట్ బోర్డ్ మెంబర్ డాక్టర్ బ్రిజ్‌భూషణ్ ఓజా, బెనారస్ హిందూ యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ సంగీత పండిట్, యూనివర్శిటీ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ శశికుమార్, తెలుగు డిపార్ట్‌మెంట్, అధిపతి డాక్టర్ బూదాటి వెంకటేశ్వర్లు, కాశీ విశ్వనాథ మందిర్ అర్చక్ డాక్టర్ శ్రీకాంత్ మిశ్రా, ప్రముఖ సంగీత విద్వాంసురాలు/ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ సుచిత్ర హొల్లా హాజరయ్యారు. నృత్యగురువు బాలత్రిపురసుందరికి 'మంజీర నాట్యం' అవార్డును ప్రదానం చేసి, శిష్యబృందాన్ని జ్ఞాపికలు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవు



తెనాలిరూరల్: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ జి. దశరథరామారావు స్పష్టం చేశారు. మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో పట్టణంలోని ఆరుపేట, రామలింగేశ్వరపేట గురవయ్య కాలనీలో శనివారం రాత్రి ఆయన స్థానికులతో మాట్లాడారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే జీవితాంతం ఇబ్బంది పడాల్సి ఉంటుందని చెప్పారు. అవసరమైతే సస్పెక్ట్ షీట్‌లు తెరుస్తామని హెచ్చరించారు. ఎన్నికల సందర్భంలో అలజడులు రేగకుండా చర్యలు తీసుకున్నామని, కౌంటింగ్ సందర్భంగా ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. అలానే టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్ తన సిబ్బందితో కలసి టూ టౌన్ సర్కిల్ పరిధిలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం నిఘా ఉంచామని, అసాంఘిక శక్తులను ఉపేక్షించేది లేదని తెలిపారు. కౌంటింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తెలిపారు.